క్లుప్తంగా

పశువుల దాహార్తి తీర్చడమే లక్ష్యం



నీటితొట్టెల నిర్మాణంలో ఏపీడీ సుబ్రమణ్యం

గుడిపాల: వేసవిని దృష్టిలో ఉంచుకొని పశువుల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ఉపాధిహామీ ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. వెంగమాంబపురం గ్రామంలో బుధవారం ఉపాధిహామీ పథకంలో నీటితొట్టెల నిర్మాణం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గుడిపాల మండలానికి 30 నీటితొట్టెలు మంజూరైనట్లు తెలిపారు. వీటన్నింటిని 10రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీఏలు చంద్ర, సుందరయ్య పాల్గొన్నారు.

పొలంలో అడ్డంగా కరెంట్ పోల్ నాటారు

చిత్తూరు కార్పొరేషన్: గుడిపాలలో తమ పొలం వద్ద అడ్డుగా కరెంటు పోల్ నాటారని రైతు ఫిర్యాదు చేశాడు. స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఆయన సమస్యను తెలియజేశారు. తాము ఊరిలో లేని సమయంలో పోల్ నాటడంతో పొలంలోకి ట్రాక్టర్ వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందన్నారు. ఓబనపల్లె, కొంగారెడ్డిపల్లెలో డిస్‌కనెక్ట్ అయిన సర్వీసును రీకనెక్ట్ చేయాలని, కొత్త సర్వీసుకు ఎలా దరఖాస్తు చేయాలని, బిల్లు కట్టినా చూపడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో పోల్ సమస్యను సిబ్బంది పరిశీలిస్తారని, మిగిలిన సమస్యను పరిష్కరించినట్లు టెక్నికల్ ఏఈ మాధురి తెలిపారు.

ఘనంగా పంగుణి బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణంలో అర్చకులు, భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పంగుణి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ధ్వజారోహణాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. స్వామికి అభిషేక పూజలు చేయించారు. అనంతరం పంచమూర్తి ఉత్సవంలో స్వామి వారు భక్తులను కనువిందు చేశారు. రాత్రి హంస వాహనంలో స్వామి వారు విహరించారు. కార్యక్రమంలో ఈవో వెంకటరాయులు, ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్, శ్రీకాలభైరవ ట్రస్టు చైర్మన్ వెంకటేష్, ఉభయదారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఐరాల: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే వారి లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని పాలకల జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్(తెలుగు) ఉపాధ్యాయుడు జగన్నాథం బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై దంపతులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ఎంతోమంది భావిభారత పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయ వృత్తిలోనే లభిస్తుందన్నారు. ఆయన శేషజీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను ఎండలో తిరగనీయొద్దు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మూడేళ్ల లోపు చిన్నారులను తొమ్మిది దాటిన తరువాత ఎండలో తిరగనీయొద్దని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. నీరు, ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలని, ఎండలో తిరిగితే వడదెబ్బకు గురికావడంతో పాటు చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చేతుల శుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పది తరువాత..?

- విద్యార్థుల్లో సందిగ్ధం
- తల్లిదండ్రులు, టీచర్లు చొరవ చూపాల్సిన సమయం
- సరైన ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్



గుడిపాల: పది పరీక్షలు పూర్తయి ఏప్రిల్ మూడో వారంలో ఫలితాలు రానున్నాయి. దీంతో ఇప్పటికే విద్యార్థుల్లో ఏ గ్రూపు తీసుకోవాలి? ఏ గ్రూపు తీసుకుంటే కెరీర్ బెటర్‌గా ఉంటుంది? ఎవరిని అడగాలి? అనే సందేహాలు దాదాపు పది పూర్తయిన ప్రతి విద్యార్థిలో ఉంటాయి. పది పరీక్షల జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ ఏప్రిల్ 3న ప్రారంభమై 12న ముగియనుంది. ఆ తరువాత ఫలితాలు వెలువడిన వెంటనే ఏమి చేయాలన్న సందిగ్ధం నెలకొనడం సహజం. ఉన్నత విద్యకు వారధిలాంటి ఇంటర్మీడియట్‌లో గ్రూపును ఎంచుకోవడమే అత్యంత కీలకమైన అంశం. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా, ఇష్టమైన సబ్జెక్టుపై దృష్టి సారించాలని, అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సులభతరమవుతుందని నిపుణులు, విద్యావంతులు, సైకాలజిస్టులు సూచిస్తున్నారు.
ఇంటర్మీడియట్ బోర్డు వివిధ కాంబినేషన్‌లో పలు గ్రూపులను రూపొందించాయి. వాటిలోనే విద్యార్థులు చేరుతున్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా వీటిపైనే దృష్టి పెడుతున్నాయి. ఆ గ్రూపులకు సంబంధించిన వివరాలు

ఎంపీసీ

ఇంజినీరింగ్ వృత్తిలో స్థిరపడాలనుకునే వారు తీసుకొనే గ్రూపు ఎంపీసీ. రాష్ట్రంలో ఎంసెట్ రాయాలనుకునేవారు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఏరో నాటికల్స్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేయాలనుకొనే వారికి ఎంపీసీ గ్రూప్ పునాది వంటిది. బిట్స్‌పిలనిలో ప్రవేశానికి జరిగే బిగ్‌షాట్ రాసేందుకు ఎంపీసీ విద్యార్థులే అర్హులు.

బైపీసీ

వైద్య సంబంధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకున్న వారు బైపీసీ వైపు శ్రద్ధ చూపవచ్చు. అగ్రికల్చర్ గ్రూపులకు ఈ గ్రూప్ ప్రాతిపదిక. ఓపిగ్గా చదవడం, స్పష్టంగా బొమ్మలు గీయగలగడం ఈ గ్రూప్ విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలు.

పాలిటెక్నిక్

పదవ తరగతి తరువాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందాలంటే ఉత్తమ మార్గం పాల్‌టెక్నిక్. దీనికోసం విద్యార్థులు పాల్‌టెక్నిక్ కామన్ ఎంట్రన్స్‌సెట్ (పాలిసెట్) ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఎంఈసీ, సీఈసీ

సైన్స్, ఆర్ట్స్ గ్రూపులపై పెద్దగా ఆసక్తి లేనివారు, సేవారంగం వైపు వెళ్లేవారు ఎంఈసీ లేదా కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్, సబ్జెక్టులున్న సీఈసీ గ్రూపులో చేరవచ్చు. చార్టర్డ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ ఏజెంట్లు, బ్యాంక్ మేనేజర్ వంటి ఉద్యోగాల్లో సాధించాలనుకునేవారు, స్టాక్ మార్కెట్లలో ఉద్యోగాలు కావాలనుకున్న వారు ఈ గ్రూపును ఎంపిక చేసుకోవచ్చు.

ఐటీఐ

ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులను ఎంచుకోవడం ద్వారా విద్యార్థి పదవ తరగతి తరువాత రెండేళ్లలో సాంకేతిక విద్యలో నైపుణ్య సాధించవచ్చు. దీనివల్ల చిన్న వయసులోనే ఉపాధి పొందే అవకాశం ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నతస్థాయి విద్యాకోర్సులు చేయవచ్చు.

ఒకరిని చూసి ఎంచుకోవద్దు



ఆలోచించి నిర్ణయం తీసుకొని ఆ లక్ష్యంతో కోర్సును ఎంపిక చేసుకొని చదవాలి. ఒకరిని చూసి మరొకరు పోటీపడి కోర్సులను ఎంపిక చేసుకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. తద్వారా కెరీర్ పాడు చేసుకుని చదువును మధ్యలో నిలిపేసి, అమ్మా, నాన్న ఆశలకు గండికొట్టవద్దు.
– లోకేష్, సీఎస్ఆర్ కళాశాల అధినేత, గుడిపాల

ఇష్టమైన సబ్జెక్టు ఎంచుకోవాలి



కష్టమైన సబ్జెక్టు కాకుండా ఇష్టమైన సబ్జెక్టును ఎంచుకుంటే ఒత్తిడి లేకుండా చదువుకోవచ్చు. ఎవరో చెప్పారని కష్టమైన గ్రూప్‌ను తీసుకొని ఒత్తిడికి గురై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు. చదువుతోపాటు క్రీడారంగంలో రాణించేందుకు ప్రయత్నించాలి.
–అర్జున్, తెలుగు అధ్యాపకులు, గుడిపాల

ఫలితాలొచ్చాక నిర్ణయించుకోండి



కంగారుపడి నిర్ణయాలు తీసుకోకూడదు. తల్లిదండ్రులు చొరవ చూపి పిల్లలకు సరైన కోర్సును సూచించాలి. ఫలితాలు వెలువడక ముందే నిర్ణయాలు తీసుకోకుండా ఫలితాలొచ్చిన తరువాత ఏ సబ్జెక్టులో ప్రావీణ్యం, ఆసక్తి ఉందో దాని ఆధారంగా కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
– గణపతి, ఎంఈఓ, గుడిపాల

నేడు సంత వేలం

యాదమరి: మండల పరిధిలోని చిన్నిరెడ్డిపల్లి క్రాస్‌లో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంతకు గురువారం వేలం పాట నిర్వహించనున్నామని ఈఓపీఆర్డీ సుకుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక సంత నిర్వహించే స్థలంలో చెత్త సేకరణ కేంద్రం వద్ద ఈ వేలం పాట ఉంటుందని చెప్పారు. ముందస్తుగా రూ.92,500 డిపాజిట్‌గా చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

చిత్తూరు అర్బన్: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ ఆనందబాబు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని పోలీసు సంఘం నాయకులు అందజేశారు. ఎస్ఆర్ పురం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆనందబాబు, మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్న పోలీసు సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నోటి శుభ్రత ప్రధానం



నోటి శుభ్రతపై మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి

బంగారుపాళెం: మానవులకు నోటి శుభ్రత ప్రధానమని స్థానిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతి అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటి శుభ్రతపై అవగాహన కల్పించారు. ఉదయం, సాయంత్రం పళ్లు తోముకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ధనుంజయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయంలో వివరాలను ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ చిత్తూరు రూరల్ మండల ఉపాధ్యక్షులుగా నాగేంద్రబాబు, రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శులుగా ప్రవీణ్, సుదర్శన్, పీటర్, వెంకటేష్, కార్యదర్శులుగా అశోక్, గురుమూర్తి, పురంధరన్, నందకుమార్, కుమార్‌స్వామి, ఈసీ మెంబర్లుగా మనోహర్, కిరణ్‌కుమార్, ప్రసాద్, జయచంద్రన్, మనవలన్, రజినీ, పూర్ణచంద్ర, దామోదరం, చంద్రశేఖర్, పట్టాభి, లోకేష్, తరుణ్, అబెల్, విజయభాస్కర్, కామరాజులు, మణిబాబు పిళ్లై, వివేకానందను నియమించారు. గుడిపాల మండల ఉపాధ్యక్షులుగా చిట్టి, రవీంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సైమన్‌రాజ్, శ్యాముల్ బాబు, రెడ్డెప్ప, ప్రవీణ్, కార్యదర్శులుగా ప్రసాద్ బాబు, రజినీ, విక్టర్, రవి, నవీన్, ఈసీ మెంబర్లుగా మోహన్‌నాయుడు, ప్రసాద్, సెవెన్‌కుమార్, రాజ్‌కుమార్, మంజునాథ్, కృష్ణయ్య, ఓంచంగ్రాయులు, ప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, దయానందరెడ్డి, వరదరాజులరెడ్డి, నగేష్, రజినీకాంత్, చిట్టిబాబు, రవిరెడ్డి, రాజేంద్రన్, గోపి, రమేష్, రవియాదవ్, సంపత్‌కుమార్, త్యాగరాజులు, మణి, మోహన్‌శ్యాముల్, జీవరత్నం, ప్రకాష్‌ను నియమించారు.

భవితలో ప్రపంచ ఆటిజం దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న పిల్లలు

యాదమరి: మండలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చాలా మంది పిల్లలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. అందులో ఆటిజం అనే బుద్ధిమాంద్యం సమస్య కూడా ఒకటని చెప్పారు. ఈ వ్యాధిలో ప్రధానంగా పిల్లల్లో వయసుకు తగిన మానసిక ఎదుగుదల లేకపోవడం ప్రధాన లక్షణం అన్నారు. ఆటిజం సమస్యగల పిల్లల మెదడులోని కొంత భాగం సరిగా పనిచేయక పోవడంతో సమస్యలకు గురవుతున్నారన్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయురాలు ఆసియాతో కలిసి పిల్లలకు అవసరమైన స్టేషనరీ అందించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

చిత్తూరు కలెక్టరేట్: పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా పాస్టర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పీవీకేఎన్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా చేశారు. అనంతరం ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ క్రిస్టియన్లపై దాడులు చేయడం బాధాకరమన్నారు. ఈ దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దాడులను అరికట్టేందుకు కూటమి పాలకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవీణ్ కుమార్ మృతికి కారణమైన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమేష్‌ప్రసాద్, కుమార్, రవి, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోండి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కార్వేటినగరం : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. అనంతరం ప్రజలు తీసుకొచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం నేతన్నలకు ప్రభుత్వం మంజూరు చేసిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొల్లాగుంట గ్రామంలో ప్రారంభించారు. అలాగే మండల కేంద్రంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ నాగరాజు, అధికారులు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలి





అలసంద పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, కొబ్బరిచెట్టుకు ఉన్న తెగుళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మాధవి

గుడిపాల: రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. చెరువుముందరవూరులో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంటలకు ముందుగా పొలంలో నవధాన్య విత్తనాలు చల్లాలని సూచించారు. దీనివల్ల భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెందడంతో పాటు కర్బనశాతం చేరడంతో పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వేసవి పప్పు దినుసుల్లో భాగంగా అలసంద పంటను పరిశీలించి, ఆకుతినే లద్దెపురుగు ఆశించినట్లు గుర్తించారు. వేపనూనె 5ఎంఎల్ తీసుకొని ఒకలీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలని సూచించారు. కొబ్బరిపంటలో ఉన్న తెగుళ్ల, రోగాలను పరిశీలించారు. ఈ తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సూచనలు పాటించాలని కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన అవసరం

గంగాధర నెల్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా పోలీసు డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శక్తి యాప్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. బాలికలకు , మహిళలకు రక్షణ కల్పించడానికి శక్తి యాప్ ఒక ఆయుధమని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ యాప్ ద్వారా ప్రమాదంలో ఉన్న మహిళలు నిమిషాల వ్యవధిలో పోలీసుల నుంచి రక్షణ పొందవచ్చని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మహిళా ఎస్ఐ నాగ సౌజన్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం



ఎంఈవోలను సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

పలమనేరు: విద్యతోనే వికాసం సాధ్యమని పలమనేరు ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం పేర్కొన్నారు. పట్టణంలోని నార్త్ ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి, తమ జీవితాలను సార్థకం చేసుకోవాలన్నారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవోలను టీచర్ల బృందం సన్మానించింది.

ఘనంగా కుంభాభిషేక పూజలు






షిరిడీ సాయి ఆలయంలో హోమం చేస్తున్న వేద పండితులు, పూజల్లో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో బుధవారం శ్రీషిరిడీ సాయిబాబా నూతన ఆలయ కుంభాభిషేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా గణేష్‌గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, గణపతి హోమం నవగ్రహ, లక్ష్మీ హోమం, సాయంత్రం మృత్సంగ్రహణం, వాస్తు శాంతి, వాస్తుహోమం, అంకు రార్పణ చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: పేదలందరికీ మెరుగైన వైద్య సేవలందిస్తామని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని దిగువ మాఘంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 37 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అరగొండలో డాక్టర్ మోహన్‌వేలు రోగులను పరీక్షించి వైద్య సేవలందించారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జోడిచింతల రోడ్డు పనుల పరిశీలన



స్థానికుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి: మండలంలోని జోడిచింతల నుంచి కన్నికాపురం వరకు జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన బుధవారం మండల అధికారులతో కలిసి పనులను జరుగుతున్న తీరును పరిశీలించారు. పనుల నిర్లక్ష్యంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. నాసిరకమైన వస్తువులు వినియోగించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.తత్వరితగతిన పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. కొంతమంది ప్రయాణికులు.. దుమ్ము, ధూళి కాలుష్యంపై అవస్థలు పడుతున్నామని కలెక్టర్‌కు చెప్పారు. దీని వల్ల చర్మ, కంటి సంబంధిత వ్యాధులకు గురవుతున్నామని చెప్పారు. రాత్రి వేళ అయితే వాహనాల రాకపోకలతో ఏర్పడుతున్న దుమ్ముధూళితో ముందు వచ్చే వాహనాల కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు, వాహనదారులు వాపోయారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు నీటిని చల్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో భూముల రీసర్వేపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ఈఓపీఆర్డీ సుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.